సాక్షి నిజామాబాద్

శనివారం । 2 । నవంబర్ । 2024



గత పాలనలోనే కష్టాలు

గత ప్రభుత్వమే విద్యుత్ రంగాన్ని విధ్వంసం చేసిందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు.

- 8లో ▸



బిల్లులకు మోక్షమెప్పుడో..?

పోలీసులకు అందాల్సిన పెండింగ్ బకాయిలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుల పాలవుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /21.5

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చలో హైదరాబాద్‌కు హోంగార్డులు వెళ్లొద్దు

ఖలీల్‌వాడి: తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా హోంగార్డులను పోలీసులు కట్టడి చేశారు. జిల్లాలోని హోంగార్డులను పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌కు పిలిపించారు. ఎవరైనా చలో హైదరాబాద్ కు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలుస్తోంది. కాగా హైదరాబాద్‌కు హోంగార్డు మృతుల కుటుంబాలు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎంగా రాజేశ్వర్



సుభాష్‌నగర్: సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా అంబదాస్ రాజేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ డీఎంగా విధులు నిర్వర్తిస్తున్న వైపీ రమేష్‌ను వనపర్తి జిల్లాకు బదిలీ చేశారు. రాజేశ్వర్ గతంలో బోధన్ ఆర్డీవోగా ఉండి రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్‌లో ఉన్నారు. తాజాగా నిజామాబాద్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎంగా నియమించారు. రాజేశ్వర్ త్వరలోనే డీఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో ఏక్తా దివస్



ఖలీల్‌వాడి: భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, దేశ సమగ్రతకు కృషిన వ్యక్తి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని డీసీపీ కోటేశ్వర్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవం(రాష్ట్రీయ ఏక్తా దివస్) లో ఆయన మాట్లాడారు. డీసీపీ (ఏఆర్) శంకర్ నాయక్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, రిజర్వు సీఐలు సతీష్ కుమార్ (అడ్మిన్), తిరుపతి (ఎమ్‌టీవో), శ్రీనివాస్ (వెల్ఫేర్), ఆఫీస్ సూపరిన్‌టెండెంట్ శంకర్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, ఐటీ కోర్ టీమ్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలకు సీఎం సానుకూలత

నిజామాబాద్ సిటీ/తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, తెలంగాణ వర్సిటీ ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు బాణోత్ సాగర్ నాయక్ వేర్వేరుగా మీడియా సమావేశంలో తెలిపారు. గురువారం దీపావళి పండుగ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా సీఎం ఇంజినీరింగ్ కళాశాలకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. సమావేశాల్లో ఎస్ఎస్‌యూఐ నాయకులు నిఖిల్‌రెడ్డి, శివ, నరందీప్, హరీ ష్, నవీన్, పవన్, కష్ణ, గోపాల్, దేవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగిన పేకాట

- రూ. 11,47,240 నగదు స్వాధీనం.. 116 మందిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: దీపావళి సందర్భంగా జిల్లాలో పేకాట జోరుగా సాగింది. జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో నిర్వహించిన పేకాట స్థావరాలపై చేసిన దాడుల్లో 116 కేసులు నమోదు చేయగా, రూ. 11,47,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో మొత్తం 116 కేసులు నమోదు కాగా 597 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.


గతేడాది కంటే తగ్గిన కేసులు

గతేడాది దీపావళి కంటే ఈ సారి పేకాట కేసులు తగ్గినట్లు సమాచారం. దీపావళికి ముందు, తర్వాత పేకాట కేంద్రాలు జోరుగా సాగుతాయి. పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో కేసులు తగ్గాయి.

డివిజన్ల వారీగా వివరాలు

డివిజన్	కేసులు	పట్టుబడిన వారు	స్వాధీనమైన నగదు
నిజామాబాద్	53	267	రూ. 5,03,570
ఆర్మూర్	26	138	రూ. 2,85,570
బోధన్	37	192	రూ. 3,58,100

వైద్యం ఖరీదైంది



■ నందిపేట్ మండలానికి చెందిన రాములు (పేరు మార్చాం) కడుపు నొప్పి భరించలేక ఆర్ఎంపీ వద్ద చూపించుకున్నాడు. సీరియస్‌గా ఉందని నగరంలోని ఫలానా ఆస్పత్రికి వెళ్తే రూ.40 వేల ప్యాకేజీలో కడుపు నొప్పి ఆపరేషన్ చేసి, మందులతో పాటు రెండు రోజుల్లో ఇంటికి పంపిస్తారని చెప్పారు. రాములు ఆర్ఎంపీ సలహా మేరకు ఆస్పత్రికి వెళ్లి కడుపు నొప్పి ఆపరేషన్ చేయించుకున్నాడు. వాస్తవానికి రూ. 15 వేల లోపు కడుపు నొప్పి ఆపరేషన్ చేస్తారు. కాగా రూ. 40 వేల ప్యాకేజీలో ఆర్ఎంపీకి కమీషన్ ఉంటుంది. ఇలా రోగులను అటు ఆస్పత్రులు, రిఫరెన్స్ ఇచ్చిన ఆర్ఎంపీలు దోచుకుంటున్నారు.

■ ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సుజాత (పేరు మార్చాం) డెలివరీ కోసం నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రికి వచ్చారు. ప్రతి నెల వచ్చి గైనిక్ డాక్టర్ వద్ద చూపించుకున్నారు. అయినా సరే నెలలు నిండగానే కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని, పాప, తల్లి ప్రాణాలకు ముప్పందని ఆస్పత్రిలోని యాజామాన్యాలు భయపెట్టడంతో ప్యాకేజీ కింద సీజేరియన్ ఆపరేషన్‌కు రూ. 60 వేలకు బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- ప్రయివేట్ ఆస్పత్రుల్లో ప్యాకేజీ పేరిట వసూళ్లు
- రోగం చిన్నదైనా, పెద్దదైనా పెద్ద మొత్తంలో చెల్లించాల్సిందే..
- ఆస్పత్రులకు రిఫరెన్స్ ఇస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు.. తద్వారా కమీషన్లు
- పర్యవేక్షణ మరిచిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ప్రయివేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మల్టీ స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ అంటూ పేర్లు పెట్టి కనీస నిబంధలు పాటించకుండానే ఆస్పత్రులు నడిపిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించి వివిధ చికిత్సలకు ధరల పట్టికలు పెట్టడం లేదు. ప్యాకేజీల పేరిట పెద్ద ఎత్తున రోగుల వద్ద వసూళ్లు చేస్తున్నారు. మనిషి చచ్చినా, బతికినా సంబంధం లేదు. ప్యాకేజీ ప్రకారం డబ్బులు చెల్లించాల్సిందే... కనీస పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.

అవసరం లేకున్నా టెస్టులు..

జిల్లాలో ప్రయివేట్ ఆస్పత్రులకు కొదువ లేదు. ముఖ్యంగా నగరంలో ఖలీల్‌వాడీ, ప్రగతినగర్, ద్వారకానగర్, హైద్రాబాద్‌రోడ్, వినాయక్‌నగర్, కంఠేశ్వర్‌రోడ్, బోధన్‌రోడ్ తదితర ప్రాంతాల్లోనే సుమారు 650 వరకు ప్రయివేట్ ఆస్పత్రులున్నాయి. ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో పదుల సంఖ్యలో ఉన్నాయి. మండల కేంద్రాలో రెండు, మూడు ఆస్పత్రులు వెలిశాయి. గత దశాబ్దకాలంగా ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు కమర్షియల్‌గా మారిపోయాయి. ఇందులో భాగంగానే ప్రయివేట్ వ్యక్తులు ముగ్గురు, నలుగురు కలిసి మల్టీస్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ పేర్లతో ఆస్పత్రులు నడిపిస్తున్నారు. కొంతమంది వైద్యులు సైతం ఇదే బాట పట్టారు. జిల్లాలో వైద్యం చాలా ఖరీదై పోతోంది. ఆస్పత్రులకు అనుగుణంగానే ల్యాబ్‌లు, మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. ప్రజలు రోగాలతో ఇబ్బందులు పడుతూ ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే చాలు.. అనవసర టెస్టులు కూడా చేస్తూ దండుకుంటున్నారని పలు ఆరోపణలు వస్తున్నాయి.

కనిపించని ధరల పట్టికలు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయివేట్ ఆస్పత్రుల్లో, ల్యాబ్‌లలో కచ్చితంగా ధరల పట్టిక ప్రదర్శించాల్సిందే. ఏ చికిత్సకు ఎంత తీసుకుంటున్నారో పట్టికలో తెలపాలి. పదుల సంఖ్యలో మాత్రమే గైనిక్ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీ, సిజేరియన్ డెలివరీలకు సంబంధించి ధరల పట్టిక బోర్డులు ఉన్నాయి. మిగతా ఆస్పత్రుల్లో ఎక్కడ కూడా కనిపించవు. అడ్మిషన్ ఫీజు రూ. 300 నుంచి రూ.500 వరకు ఇష్టారీతిన తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రులను పర్యవేక్షణ చేయాల్సిన వైద్యారోగ్యశాఖాధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యా దులు చేస్తే పరిశీలిస్తామని చెబుతూ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

రోగం నయం కాకున్నా..

చాలా ఆస్పత్రుల్లో ఎవరైనా డెలివరీకి వచ్చినా, పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడినా, యాక్సిడెంట్లు, ఇతరత్రా అనారోగ్యలకు గురైనా నిర్వాహకులు ప్యాకేజీలు మాట్లాడుకుంటున్నారు. ప్యాకేజీలు రూ. 40 వేల నుంచి రూ. లక్షల్లో ఉంటున్నాయి. అడ్వాన్సులు తీసుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. ప్యాకేజీలు మాట్లాడిన తర్వాతా రోగులు బతికినా, చచ్చినా సరే మొత్తం డబ్బులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోగం వచ్చిన వారికి పూర్తిగా నయం కాకన్నా సరే ప్యాకేజీలు మాత్రం చెల్లించాల్సిందే.

చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కచ్చితంగా ధరల పట్టిక ప్రదర్శించాల్సిందే. ఇది వరకే సమీక్షలు పెట్టి మరీ ఆదేశాలు ఇచ్చాం. ప్యాకేజీల విషయం నా దష్టికి వచ్చింది. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే పరిశీలించి కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

పదిలో ఉత్తమ ఫలితాల కోసం కసరత్తు

- ప్రత్యేక ప్రణాళిక విడుదల చేసిన విద్యాశాఖ



అభ్రూద్ పాఠశాలలో ప్రత్యేక తరగతులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని పదవ తరగతిలో ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం పదో తరగతి విద్యార్థులకు విద్యా బోధన, స్లిప్ టెస్టులు నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,162 మంది, ప్రయివేట్ పాఠశాలల్లో 11,673 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు.

ప్రత్యేక ప్రణాళిక ఇలా..

ప్రతిరోజు సాయంత్రం 4.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను బోధిస్తారు. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరయ్యేటట్లు చూడాలి. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలి. ప్రత్యేక తరగతులకు సంబంధించి నోట్స్ తయారు చేసుకునే విధంగా చూడాలి. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి గురించి తెలియజేయాలి. ప్రత్యేక బోధన సమయంలో రెగ్యులర్ బోధన నిర్వహించకూడదు. ప్రత్యేక తరగతులలో బోధించిన అంశాలపై విషయాల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రశ్న పత్రాలను విశ్లేషించి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంసిద్ధం చేయాలి. పాఠ్యపుస్తకంలోని అన్ని అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగు సూచనలతో మెరుగుపరచాలి. పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ఈ ప్రణాళిక అమలులో ఉంటుంది. డీఈవో దుర్గప్రసాద్ మాట్లాడుతూ పదో తరగతిలో గతంలో కంటే మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.



కామారెడ్డి గాంధీ గంజ్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం

- తుపాను ప్రభావంతో వర్షం
- కొనుగోళ్లు మొదలుకాక రైతులకు అవస్థలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తుపాను ప్రభావంతో కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలలో శుక్రవారం వర్షం కురిసింది. కామారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, లింగంపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల్లో కురిసిన భారీ వర్షంతో ధాన్యం నానిపోయింది. కొన్నిచోట్ల ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడిన తర్వాత చేతికొచ్చిన పంట వర్షార్పణం అవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న జాప్యం రైతులకు శాపంగా మారింది.



కామారెడ్డి గాంధీ గంజ్‌లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

ఈ ఏడాది 277 టీఎంసీల వరద నీరు

- ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద
- గతేడాది కంటే ఎక్కువే



బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఈ సంవత్సరం ఇప్పటి వరకు 277 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇంకా 7 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. గత జూన్ నుంచే ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రారంభమైంది. సెప్టెంబర్‌లో అధికంగా 154 టీఎంసీల నీరు వచ్చింది. దీంతో ప్రాజెక్ట్ నుంచి సెప్టెంబర్‌లో వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. అలా మొత్తం 100 టీఎంసీల కంటే ఎక్కువే గోదావరి పాలైంది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గత నెల 29న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసి వేశారు. దీంతో ఎగువ మహారాష్ట్ర నుంచి గోదావరిలోకి వరదలకు బ్రేకు పడింది.

మరో వారం రోజుల్లో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ కోసం కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల నిలిపి వేసే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్ ప్రారంభం వరకు ప్రాజెక్ట్ నిండుకుండలా ఉండే అవకాశం ఉంది. యాసంగి పంటలకు ప్రణాళిక ప్రకారం డిసెంబర్ మధ్య మాసం నుంచి నీటి విడుదల చేపడుతారు. అప్పటి వరకు ఎగువ ప్రాంతాల నుంచి స్వల్ప వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 571 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా గురువారం ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను నిలిపి వేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిలకడగా ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

గతేడాది 208 టీఎంసీలు

ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుత సంవత్సరం గతేడాది కంటే ఎక్కువ వరద నీరు వచ్చి చేరింది. గతేడాది ప్రాజెక్ట్‌లోకి 208 టీఎంసీల వరద నీరు మాత్రమే వచ్చింది. ఈసారి 277 టీఎంసీల వరద నీరు వచ్చింది. ఈ సంవత్సరం జూన్‌లో 3.99 టీఎంసీలు, జూలైలో 27.52 టీఎంసీలు, ఆగస్టులో 33.48 టీఎంసీలు, సెప్టెంబర్‌లో 154.43 టీఎంసీలు, అక్టోబర్‌లో 57.16 టీఎంసీల వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చింది.

సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం

- ఇళ్ల వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- ప్రతి కుటుంబ వివరాలు పక్కాగా సేకరించాలని ఆదేశాలు
- బోధన్‌లో హౌస్ లిస్టింగ్‌ను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: సమగ్ర కుటుంబ సర్వేకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం అయ్యింది. ఈనెల 6 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సర్వేకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకు ఈ సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా హౌస్ లిస్టింగ్ సర్వేను ప్రారంభించారు. అనంతరం ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభం కానుంది

సమగ్ర వివరాల కోసం

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రతిరోజు ఒక ఉద్యోగి 10 ఇళ్ల కుటుంబ వివరాలను నమోదు చేయాలి. కుటుంబంలోని సంఖ్య, కులము, నివాస గృహాలు, మోటార్ వాహనాలు, వ్యవసాయ, ఉద్యోగి వివరాలు ఆడ, మగ ఇలాంటి పూర్తి వివరాలను సేకరిస్తారు. జిల్లాలోని 1178 మంది ఆశా కార్యకర్తలు, 2175 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 536 పంచాయతీరాజ్ సెక్రెటరీలను సర్వేకు కేటాయించారు. పాఠశాల విద్యాశాఖకు చెందిన టీచర్లను కూడా సర్వేకు వినియోగిస్తున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బోధన్‌లో పర్యటిస్తూ ఇళ్ల జాబితాల రూపకల్పన ప్రక్రియను పరిశీలించారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేటతో పాటు లంగ్డాపూర్ గ్రామంలో అధికారులు, సిబ్బంది జిల్లా జాబితా రూప కల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతులను కలెక్టర్ తెలుసున్నారు. ఇళ్ల పై సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అతికిస్తుండగా వాటిపై నమోదు చేస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఏ ఒక్క నివాస గృహం వదలకుండా హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మున్సిపల్ పట్టణ పరిధిలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. సర్వే కోసం ఎన్యు మరేషన్ బ్లాక్‌లోని ప్రతి ఇంటికి క్రమ సంఖ్యను కేటాయించారు. ఇళ్ల జాబితా పక్కగా రూపొందితే సర్వే సక్రమంగా చేపట్టవచ్చునని అధికారులు భావిస్తున్నారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ మూడు రోజుల్లోపు హౌస్‌లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఎక్కడ కూడా డూప్లికేషన్ లేకుండా హౌస్ లిస్టింగ్ చేసి ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుకు పూర్తిస్థాలో ఇప్పటికే అవగహన కార్యక్రమాలను నిర్వహించారు.



లంగ్డాపూర్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేపై సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

టీచర్లకు విధుల కేటాయింపు

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలు, ప్రధానోపాధ్యాయులకు ఈ సర్వేలో విధులను కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 1263 మంది ఆశా కార్యకర్తలు, 2153 మంది అంగన్వాడీ టీచర్లు, 537 మంది పంచాయతీరాజ్ సెక్రెటరీలను సర్వేకు కేటాయించారు. వీరికి అదనంగా టీచర్లను కూడా కేటాయిస్తూ పాఠశాల విద్యాశాఖ సెక్రెటరీ బుర్ర వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేసే టీచర్లు ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాఠశాల బోధన చేపట్టి, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత సమగ్రా కుటుంబ సర్వేలో పాల్గొననున్నారు. ఒకవేళ ఒక పాఠశాలలో ఒకే టీచర్ ఉంటే సమీప పాఠశాల టీచర్లను విధులకు కేటాయించనున్నారు. ఇలా విద్య బోధనకు ఆటంకం లేకుండా కేవలం ప్రాథమిక పాఠశాల టీచర్లకు మాత్రమే విధులు కేటాయించారు. ఉన్నత పాఠశాలలో పని చేసే టీచర్లకు విధులు కేటయించలేదు.

కాగా సమగ్రా కుటుంబ సర్వేలో ప్రభుత్వ టీచర్లు కూడా పాల్గొంటారని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. సర్వేను పక్కగా చేపడతామని, ఇది వరకే ఏర్పాట్లు కూడా చేశామని కలెక్టర్ 'సాక్షి' కి తెలిపారు.



మాక్లూర్ మండలం మదన్‌పల్లిలో హౌస్‌లిస్టింగ్ సర్వేలో పాల్గొన్న పంచాయతీ సెక్రెటరీ

క్లుప్తంగా

5న పెన్షనర్ల పోరుబాట



నిజామాబాద్‌నాగారం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 5న ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌– రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ నిజామాబాద్‌ జిల్లా అధ్యక్షుడు కె రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా దేశంలోనే అత్యధిక డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను ను విదిలించి పెన్షనర్లను నిరాశకు గురి చేసిందన్నారు.రిటైర్డ్‌ అయిన ఉద్యోగులకు రావాల్సిన పెన్షనరీ బెనిఫిట్స్‌ వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.లావు వీరయ్య,ఈవీఎల్‌ నారాయణ,నర్రా రామారావు, ప్రసాద్‌,రాధా కిషన్‌,శిర్ప లింగయ్య,చంద్రశేఖర్‌,లక్ష్మీనారాయణ,సాగర్‌ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–17 బాలబాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు సంబంధించి రాష్ట్రస్థాయికి జిల్లా జట్టు ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. పాత కలెక్టరేట్‌ మైదానంలో క్రీడల కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో ఎంపికలు చేపట్టారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 5న సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలురు పాల్గొంటారని, బాలికలకు జిల్లాలోనే ఉంటుందని తేదీ మాత్రం ఖరారు కాలేదని పేర్కొన్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

మోర్తాడ్‌లో పెట్రేగిపోతున్న ఆకతాయిలు

మోర్తాడ్‌: మండల కేంద్రంలో కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో పెట్రేగిపోతున్నారు. బైక్‌లను అతి వేగంగా నడుపుతూ పాదాచారులపై దాడికి పాల్పడుతున్నారు. తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన బాలపెల్లి రమేశ్‌ బుధవారం రాత్రి భోజనం చేసి మున్నూరు కాపు సంఘం నుంచి మొండివాగు వంతెన వరకు వాకింగ్‌కు బయలుదేరాడు. అతన్ని అనుసరించిన ముగ్గురు ఆకతాయిలు బైక్‌పై వెనుక నుంచి వచ్చి పిడిగుద్దులు గుద్దారు. దీంతో రమేశ్‌ వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. వారు మద్యం మత్తులోనే తనపై దాడికి పాల్పడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి ఆకతాయిల ఆట కట్టించాలని పలువురు కోరుతున్నారు.

23 తులాల బంగారం చోరీ



ఖలీల్‌వాడి: నిజామా బాద్‌ నగరంలోని మూడవ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధి న్యూ ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న సముద్రాల ఏలేశ్వర్‌ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై మహేష్‌ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం.. దీపావళి పండగకు ఖమ్మం వెళ్లిన కుటుంబం తిరిగి వచ్చే సరికి ఇంటికి తాళం పగలగొట్టబడి ఉంది. ఇంట్లో పరిశీలించగా బీరువా పగలగొట్టి 23 తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెండింగ్‌ బిల్లులకు మోక్షమెప్పుడు..?

- టీఏ, డీఏ, పీఆర్సీ ఏరియర్స్‌ కోసం ఏడాదిగా పోలీసుల ఎదురు చూపులు
- ఒక్కొక్కరికి రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు బకాయి



ఖలీల్‌వాడి: పెండింగ్‌ టీఏ, డీఏ, పీఆర్సీ ఏరియర్స్‌.. ఇలా అనేక సమస్యలతో పోలీసులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు 24 గంటలపాటు పని చేస్తున్న పోలీసులకు ఇవ్వాల్సిన బకాయిలు సకాలంలో అందక అప్పుల పాలవుతున్నారు. జిల్లాలోని 32 పోలీస్‌స్టేషన్లకు ప్రతి నెలా రూ. 25 వేలు రావాల్సిన స్టేషనరీ చార్జిలు ఏడాదిగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా జిల్లాలో పోలీసులకు సుమారు రూ. 20 కోట్ల నుంచి 25 కోట్ల వరకు పెండింగ్‌ బిల్లులు ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది.

నిజామాబాద్‌ కమిషనరేట్‌లోని 32 పీఎస్‌లలో పని చేసే సిబ్బందికి టీఏ, డీఏ, పీఆర్సీ ఏరియల్స్‌ పెండింగ్‌లో ఉన్నాయి. డీఏ లు ఇప్పటి వరకు ఐదు ఇవ్వాల్సి ఉండగా ఇటీవల ప్రభుత్వం ఒక డీఏను ప్రకటించింది. ఇది నవంబర్‌ నెలలో వస్తుందని భావించినా డిసెంబర్‌లో వస్తుందని సమాచారం. పీఆర్సీ ఏరియల్స్‌ ఏడాదిగా పోలీసులకు అందడం లేదు. ఒక్కొక్కరికి రూ. 50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రావాల్సి ఉందని తెలిసింది. ఈ పెండింగ్‌ బిల్లుల ద్వారా పోలీసులు తమ అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలా పెండింగ్‌ బిల్లులు అందుక పిల్లల ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు.

పోలీసులకు సరెండర్‌ లీవ్స్‌

పీఎస్‌లలో పూర్తి స్థాయిలో పోలీసులు లేకపోవడంతో సివిల్‌ పోలీసులకు సెలవులు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబ సభ్యులు, పిల్లలు, బంధువులతో గడపలేని పరిస్థితి నెలకొంటోంది. సెలవులను పోలీసులు సరెండర్స్‌ చేసినవి ఐదు ఉంటే అందులో మూండిటిని మంజూరు చేయగా మరో రెండు పెండింగ్‌లో ఉంటున్నాయి.

పీఎఫ్‌ లోన్స్‌ పెండింగ్‌

పోలీసులకు అందాల్సిన పీఎఫ్‌లోన్స్‌ కూడా పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లా కేంద్రంలోని ఓ పోలీస్‌ పీఎఫ్‌ లోన్‌ కోసం జనవరిలో దరఖాస్తు చేసుకుంటే 10 రోజుల క్రితం ఖాతాలో జమ అయినట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో పీఎఫ్‌ లోన్స్‌ తీసుకున్న సిబ్బందికి నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రైవేట్‌ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రత స్కీమ్‌ నిధుల మళ్లింపు

పోలీసులు అత్యవసర సమయంలో నిధులను వినియోగించుకోడానికి భద్రత స్కీమ్‌ నిధిని ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వం పోలీస్‌శాఖలోని భద్రత నిధులను దారి మళ్లించి ఇతర పనులకు ఉపయోగించినట్లు తెలిసింది. పోలీసులు తమ వేతనంలో నుంచి రూ. 1000 నుంచి రూ. 3వేల వరకు భద్రత స్కీమ్‌ నిధులలో జమ చేసుకుంటారు. ఈ నిధి ద్వారా పోలీసులు పిల్లలకు ఫీజులు, పిల్లల వివాహాలకు వాడుకుంటారు. కానీ నిధులు లేకపోవడంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

త్వరలో విడుదల అవుతాయి

పోలీస్‌ సిబ్బందికి అందాల్సిన పెండింగ్‌ బిల్లులు త్వరలో విడుదలవుతాయి. పెండింగ్‌ బిల్లులపై రాష్ట్ర పోలీసుల సంఘం ఆధ్వర్యంలో డీజీపీ జితేందర్‌, ఇంటిలిజెన్స్‌ ఐజీ శివదర్‌రెడ్డి, పీఅండ్‌ఎల్‌ ఐజీ రమేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. డీజీపీ ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడారు. దీంతో పోలీసు సిబ్బందికి రావాల్సిన టీఏ, డీఏ, పీఆర్సీ ఏరియల్స్‌, పీఎఫ్‌ లోన్స్‌ తొందరగా క్లియర్‌ అవుతాయి.

– షకీల్‌పాషా, జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షుడు

ఉపాధి కోసం వెళ్లి.. కోమాలోకి



కోమా స్థితిలో ఉన్న సాయన్నతో కుటుంబీకులు

మోర్తాడ్‌: ఉపాధి నిమిత్తం ఖతర్‌కు వెళ్లిన ఓ వ్యక్తి కోమాలోకి జారుకోవడంతో అతని కుటుంబం తీవ్ర ఆందోళన చెందుతోంది. పది నెలలుగా ఖతర్‌లో చికిత్స అందించినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో అతన్ని శుక్రవారం హైదరాబాద్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ముప్కాల్‌ మండలం నాగంపేట్‌కు చెందిన బదనపల్లి సాయన్న కొన్నేళ్లుగా ఖతర్‌లో ఉపాధి పొందుతున్నాడు. పది నెలల క్రితం అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లగా కంపెనీ యాజమాన్యం అక్కడే చికిత్స అందిస్తోంది. అతనిలో మార్పులు రాకపోవడంతో అక్కడి కంపెనీ యాజమాన్యం హైదరాబాద్‌కు తరలించింది. అతని భార్య ప్రేమల, కుమారులు వికాస్‌, వినీత్‌ల కోరిక మేరకు మెరుగైన వైద్యం అందించాలని కాంగ్రెస్‌ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కోమాలో ఉన్న సాయన్నను హైదరాబాద్‌కు తరలించడం, అతనికి నిమ్స్‌లో అడ్మిషన్‌ ఇప్పించడానికి కాంగ్రెస్‌ ఎన్నారై సెల్‌ కన్వీనర్‌ మంద భీంరెడ్డి సమన్వయం చేస్తున్నారు.

క్రైం కార్నర్‌

మురికి కాలువలో పడి ఒకరి మృతి



వెంకటి (ఫైల్‌)

పెద్దకొడప్‌గల్‌: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్‌ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్‌ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్థానిక వైన్స్‌ షాప్‌, బ్రిడ్జి పక్కన ఉన్న మురికి కాలువలో గురువారం రాత్రి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు బోర్లం గ్రామానికి చెందిన వెంకటి(48)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య కోటవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో వివాహిత..

కోటగిరి: విద్యుత్‌ షాక్‌తో వివాహిత మృతి చెందిన ఘటన కోటగిరి మండలం ఎత్తొండ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందని డి లక్ష్మి (40) వృత్తిలో భాగంగా ఓ ఇంట్లో బట్టలు ఉతికి ఆరేస్తుండగా విద్యుత్‌షాక్‌ తగిలి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఒకరు..

నవీపేట: మండల రైల్వే స్టేషన్‌ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. ఘటన స్థలంలో మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..

సదాశివనగర్‌: మండలంలోని వజ్జపల్లిలో ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు. గ్రామంలోని పేరం భాను ప్రసాద్‌(11) కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందును సేవించాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సౌదీలో తిర్మన్‌పల్లి వాసి మృతి



నీల స్వామి(ఫైల్‌)

సదాశివనగర్‌: మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన నీల స్వామి(42) పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో సౌదీలో మృతి చెందినట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. బతుకుదెరువు నిమిత్తం గత పన్నెండేళ్ల నుంచి సౌదీకి వెళ్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడి వారు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ స్వామి మృతి చెందినట్లు అక్కడ ఉన్న బంధువులు కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడికి భార్య స్వప్న, కుమార్తెలు అక్షయ, ఐశ్వర్య ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా తెప్పించాలని కుటుంబీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పీఎస్‌లో ఆత్మహత్యాయత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు

బోధన్‌టౌన్‌: బోధన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో ఒంటిపై పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పీఎస్‌లో బెల్లాల్‌ గ్రామానికి చెందిన రాజు, సవిత్రి భార్యాభర్తలు. అక్టోబర్‌30న వీరు సంసార విషయంలో గొడవ పడ్డారు. దీంతో భార్య సావిత్రి ఇంటి నుంచి వచ్చి పట్టణంలో నివాసం ఉంటున్న సమీప బంధువు లక్ష్మి వద్ద ఉండగా 31న రాజు బంధువు అయిన లక్ష్మి ఇంటికి వెళ్లి నా భార్యను ఎందుకు ఇంట్లో ఉంచుకున్నారంటు వారితో గొడవ పడి లక్ష్మిపై చేయి చేసుకున్నాడు. దీంతో లక్ష్మి రాజుపై ఫిర్యాదు చేసేందుకు పీఎస్‌కు చేరుకుంది. విషయం తెలుసుకున్న రాజు పోలీసులకు ఫిర్యాదు చేయొద్దంటు లక్ష్మిని కోరాడు. ఆమె వినకపోవడంతో తన వెంట తీసుకొచ్చిన పెట్రోల్‌ను రాజు తన ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు రాజును నిలువరించి సముదాయించారు. పీఎస్‌లో ఆత్మహత్యాయత్నానికి యత్నించిన రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జవాన్‌పై శానిటరీ ఎస్సై దాడి

నిజామాబాద్‌ సిటీ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఉద్యోగులు ఇద్దరు ఘర్షణ పడ్డారు. పని కేటాయింపు విషయంలో పారిశుధ్య విభాగానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు ఘర్షణపడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. శుక్రవారం సర్కిల్‌–5లో పారిశుధ్య పనులు చూస్తున్న అవుట్‌ సోర్సింగ్‌ జవాన్‌ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌ వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు పరుషపదజాలంతో తిట్టుకున్నారు. పారిశుధ్య ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌ జవాన్‌ వెంకటస్వామిపై దాడిచేశాడు. దీంతో జవాన్‌ మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

కాకతీయ కాలువలో ఒకరి గల్లంతు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన కొండూరు గంగాధర్‌ శుక్రవారం ప్రమాదవశాత్తు కాకతీయ కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్‌ శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కాకతీయ కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి కొట్టుకుపోయాడు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సారెస్పీ అధికారులతో ఎస్సై నారాయణ మాట్లాడి నీటి విడుదలను నిలుపుదల చేయించి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయిన అతని జాడ లభించలేదు. శనివారం ఉదయం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్సై తెలిపారు. గంగాధర్‌ గల్లంతైన విషయాన్ని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి స్పందించి తన అనుచరుల ద్వారా రూ. 5 వేల ఆర్థికసాయం అందేలా చూశారు.

వ్యసనాలకు లోనై తండ్రి హత్య

నస్రుల్లాబాద్‌: చెడు వ్యసనాలకు బానిసైన కొడుకు.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్నతండ్రిని కర్రతో విపరీతంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నస్రుల్లాబాద్‌ మండలం నెమ్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కర్రె హనాండ్లుకు మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం కోసం తండ్రి సాయిబోయి(75) డబ్బులు అడిగేవాడు. గురువారం రాత్రి సైతం మద్యానికి డబ్బులు కావాలని తండ్రిని అడిగాడు. తండ్రి డబ్బులు లేవు అనడంతో కోపంలో అక్కడే ఉన్న కర్రతో తండ్రిపై ఇష్టారీతిన దాడి చేశాడు. దీంతో దెబ్బలకు తాళలేక తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేదలను మోసం చేసేందుకే ఇందిరమ్మ కమిటీలు

- నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా



సుభాష్‌నగర్‌: నిరుపేదలకు మోసం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు వేస్తోందని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా అన్నారు. కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలకు పంచేందుకే కమిటీల్లో వారికే అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లలో అర్హులైన జాబితాను ప్రజాక్షేత్రంలోనే నిర్ణయించాలని, వీటితోపాటు డబుల్‌ బెడ్‌రూం ఇండ్లను కూడా అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులకు వర్తింపజేసి పేదోడి సొంతింటి కలను నిజం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

విద్యుత్‌ రంగాన్ని విధ్వంసం చేసి విజయోత్సవాలా..?



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్‌ శ్రేణులపై విమర్శలు చేసిన మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్‌: రాష్ట్ర విద్యుత్‌ రంగాన్ని విధ్వంసం చేసి ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని విజయోత్సవాలను నిర్వహించుకుంటున్నారని రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌, జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ నేతలను ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ పాలనలో విద్యుత్‌ వినియోగదారులపై ఎనలేని భారం మోపి ఉచితంగా 200ల యూనిట్ల విద్యుత్‌ను అందిస్తున్న కాంగ్రెస్‌ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. భీమ్‌గల్‌ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కృషితోనే విద్యుత్‌ చార్జీలను పెంచే ఆలోచనను కాంగ్రెస్‌ ప్రభుత్వం మానుకుందని, దీనిని బీఆర్‌ఎస్‌ శ్రేణులు తమకు అనుకూలంగా మార్చుకొని సంబురాలు చేపట్టడం సరైంది కాదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. 2014 నుంచి 2024 వరకు విద్యుత్‌ చార్జీలను పెంచిన విషయంపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్‌ విసిరారు. పేద ప్రజలపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మక్కువ ఉంటే చర్చకు రావాలని సూచించారు. విద్యుత్‌ చార్జీల విషయంలో తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, నాయకులు నర్సయ్య, కుంట రమేశ్‌, అనంతరావు, గోపాల్‌ నాయక్‌, కొరడి రాజు, నాగేంద్రబాబు, బద్దం అవినాశ్‌, ముచ్కూర్‌ సహకార సంఘం చైర్మన్‌ బంగ్లా దేవేందర్‌, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్‌, చంద్రునాయక్‌, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



భర్త ఇంటి ఎదుట మౌన పోరాటం చేస్తున్న భార్య, కొడుకు, కోడలు

ఎల్లారెడ్డి: వివాహమాడిన భార్యకు ఆస్తి పంపకం చేయక పోవడంతో భర్త ఇంటి ఎదుట కొడుకు, కోడలుతో కలిసి భార్య మౌన పోరాటం చేసిన ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని గండిమాసానిపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమాసానిపేటకు చెందిన రిటైర్డు బ్యాంకు మేనేజర్‌ ప్రేమానందం 30 ఏళ్ల క్రితం సుశీలను వివాహం చేసుకున్నాడు. గత కొన్నేళ్లుగా మనస్పర్థలతో వారు దూరంగా ఉంటున్నారు. కాగా అతను వేరే మహిళతో సహజీవనం చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. సుశీలకు కొడుకు అనిల్‌ ఉండడంతో అతడికి ఆస్తి పంచి ఇవ్వడం లేదని దీంతో సుశీల కొడుకు అనిల్‌, కోడలుతో కలిసి భర్త ఇంటి ఎదుట మౌన పోరాటం చేసింది. తనకు ఆస్తి పంచి ఇవ్వాలని డిమాండ్‌ చేసింది. సుశీల పోరాటానికి గ్రామస్తులు సైతం మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని పీఎస్‌కు తరలించారు. సమస్యను పరిష్కరించాలని సుశీల పోలీసులను వేడుకుంది.

లింగంపల్లిలో ఒకరి హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

సదాశివనగర్‌: మండలంలోని లింగంపల్లి శివారులోని డంపింగ్‌ యార్డ్‌ వద్ద నిజామాబాద్‌ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల కృష్ణ(38)ను గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండ రాయితో మోది దారుణంగా హత్య చేసిన ఘటనా గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సంతోష్‌కుమార్‌, ఎస్సై రంజిత్‌ ఘటన స్థలానికి చేరుకుని హత్య ఘటనపై ఆరా తీశారు. డాగ్‌ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కరడ్‌పల్లి శివారు నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి హెల్మెట్‌ ధరించి బైక్‌పై లింగంపల్లి శివారుకు చేరుకున్నట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా తెలిసింది. ధర్మారానికి చెందిన వ్యక్తి, లింగంపల్లి శివారుకు ఎలా వచ్చాడనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మొదటగా హత్యకు గురైన వ్యక్తికి ఎడమ చేయి సిజేరియన్‌ వల్ల తొలగించబడి ఉందని, కుడి చేతిపై అమ్మ అని రాసి ఉన్న పుట్టుమచ్చ ఉందని, మెడలో రుద్రాక్ష ధరించి ఉన్నాడు. ఈ వివరాలతో పోలీసులు ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాలకు వివిధ గ్రూపుల్లో షేర్‌ చేశారు. గురువారం సాయంత్రం వరకు మృతుడు ఎవరనే విషయంపై స్పష్టత రాలేదు. సర్కిల్‌ కార్యాలయంలో పని చేస్తున్న నిజామాబాద్‌కు చెందిన అశోక్‌ హత్యకు గురైన వ్యక్తికి సంబంధించిన ఫొటోలు తన స్టేటస్‌లో పెట్టుకోవడంతో మృతుడి ఆచూకీ లభించింది. మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించారు. లింగంపల్లి శివారుకు తీసుకొచ్చి ఎందుకు హత్య చేశారనే విషయం తేలాల్సి ఉంది. డబ్బుల వ్యవహారమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీసాల పేరిట ఘరానా మోసం



రాజంపేట: విదేశాలు వెళ్లేందుకు వీసా ఇప్పిస్తానంటూ బాధితుల దగ్గర డబ్బులు తీసుకొని వారిని మోసం చేసి పరారైన నిందితుడిని పట్టుకుని జ్యుడీషియల్‌ కస్టడికి తరలించినట్లు ఎస్సై పుష్పరాజ్‌ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. దోమకొండ గ్రామానికి చెందిన మల్లేశం గౌడ్‌ రాజంపేట మండలానికి చెందిన ముగ్గురి నుంచి వీసాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ. లక్ష20 వేలు వసూలు చేసి పరారయ్యాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లేశం పేరు మార్చుకుని పాల్వంచ కొత్తగూడెంలో ఇదే తరహా దందా చేస్తున్నట్లు సమాచారం అందడంతో రాజంపేట పోలీసులు అతన్ని పట్టుకుని గురువారం జ్యుడీషియల్‌ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసులో నిందితుడిని చాకచక్యంగా పట్టుకోడానికి కృషి చేసిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌, రాజేశ్‌, రవీందర్‌లను ఎస్సై అభినందించారు.

మొరం టిప్పర్ల పట్టివేత

రుద్రూర్‌: కోటగిరి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే గుట్ట ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా అక్కడ ఉన్న రెండు టిప్పర్లను సీజ్‌ చేసి తహసీల్‌ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్‌ గంగాధర్‌ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ శుక్రవారం తెలిపారు. సదరు మహిళకు ఇటీవల వివాహం కావడంతో భర్తతో గొడవల కారణంగా తల్లిగారింటి వద్ద ఉంటోంది. గత నెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సరిత తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.